చెత్త ఫుల్.. సంపద నిల్

- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- పేరుకుపోతున్న చెత్త నిల్వలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గన్నవరం: చెత్త డంపింగ్ సమస్యల పరిష్కారానికి, వ్యర్థాల నుంచి గ్రామ పంచాయతీలకు సంపద సృష్టించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాలు నియోజకవర్గంలో నిరుపయోగంగా మారాయి. వీటిపై అధికారులు, ప్రజాప్రతినిధులు అసక్తి కనబరచడం లేదు. ఫలితంగా లక్షలాది రూపాయిలతో నిర్మించిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు ఏళ్ల గడుస్తున్నా వినియోగంలోకి రావడం లేదు.



గన్నవరంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుండి సంపద సృష్టి కేంద్రం

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని 84 గ్రామపంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 2016 నుంచి ఈ కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణ, వర్మికంపోస్ట్ ఎరువుల తయారీ విధానంపై పలుమార్లు అధికారులు, సిబ్బందికి క్షేత్రస్థాయిలో శిక్షణ కూడా ఇచ్చారు. అవసరమైన యంత్ర పరికరాలను కూడా మేజర్ గ్రామ పంచాయతీలకు సరఫరా చేశారు. కేవలం పది శాతం గ్రామ పంచాయతీల్లో మాత్రమే అరకొరగా వర్మికంపోస్ట్ ఎరువులను తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలకు డంపింగ్ యార్డులు లేకపోవడంతో చెత్త సమస్య నానాటికి జఠిలమవుతోంది. ప్రతిరోజు గ్రామ పంచాయతీ సిబ్బంది సేకరిస్తున్న టన్నుల కొద్దీ చెత్తను గ్రామ శివారుల్లో డంప్ చేస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి చెత్త సంపద సృష్టి కేంద్రాలు కొంత వరకు దోహదపడతాయి. అయినప్పటికి ఈ కేంద్రాలను వినియోగించేందుకు అధికారులు, పాలకవర్గాలు ముందుకురావడం లేదు.

రూ.30 లక్షల వరకు ఖర్చు చేసినా..

నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలో ఈ కేంద్రం నిర్మించి పదేళ్ల గడుస్తున్నా ఇంతవరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ఈ కేంద్రం నిర్మాణానికి, మరమ్మతులకు ఇప్పటివరకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు చేసినప్పటికి పైసా సంపద సృష్టించలేకపోయారు. ప్రతిరోజు గ్రామంలో సేకరిస్తున్న ఐదు టన్నుల వరకు చెత్తను గుంటూరులోని జిందాల్ ప్లాంట్‌కు తరలించేందుకు ప్రతినెలా లక్షల రూపాయలు గ్రామపంచాయతీ నిధులను వెచ్చిస్తున్నారు. మేజర్ గ్రామాలైన కేసరపల్లి, బుద్దవరంలో ఇదే పరిస్థితి నెలకొంది. మిగిలిన గ్రామాల్లో అయితే డంపింగ్ యార్డులు లేకపోవడంతో గ్రామ శివారులో చెత్తను డంప్ చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి..

ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. దీనివల్ల కొంత వరకైనా చెత్త సమస్యకు పరిష్కారం లభిస్తుందంటున్నారు.

ప్రజాధనం వృథా



కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చుకునే అవకాశం ఉన్న ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడం లేదు. దీంతో గ్రామ శివారులో ఉన్న ఈ కేంద్రాలు పందులు, కుక్కలకు అవాసాలుగా, మందుబాబులకు అడ్డాగా మారాయి.

– ఎం.నాగేశ్వరరావు, ప్రజా సంఘాల నేత

గాలికి వదిలేశారు..



గ్రామాల పరిశుభ్రతతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను గాలికి వదిలేశారు. గన్నవరం కోనాయి చెరువు వద్ద పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. పారిశుద్ధ్య నిర్వహణ పేరుతో ప్రతినెలా రూ.లక్షలను ఖర్చుచేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కేంద్రాలపై దృష్టి పెట్టాలి.

– ఆర్.మురళి, గన్నవరం

చర్యలు తీసుకుంటున్నాం..

అన్ని గ్రామ పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తూ సంపద తయారీ కేంద్రాల పనితీరును పరిశీలిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులను కూడా అప్రమత్తం చేశాం. వర్మి కంపోస్టు తయారీకి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– టి.స్వర్ణలత, ఎంపీడీఓ, గన్నవరం

క్లుప్తంగా

దివ్యాంగుల అవగాహన ర్యాలీ



కంకిపాడు: ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని పురస్కరించుకుని కంకిపాడు భవిత కేంద్రంలోని దివ్యాంగులు, ప్రత్యేక ఉపాధ్యాయులు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆటిజం లక్షణాలను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఆటిజం గుర్తింపుపై అవగాహన కల్పించారు. ఎంపీఎంపీ హెచ్ఎం పి.సాంబశివరావు, ఐఈ రీసోర్సు టీచర్లు పీవీడీ నాగేశ్వరి, ఎం.దీప్తి, జెడ్పీ పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయురాలు శిరీష పాల్గొన్నారు.

కుట్టు, అల్లికలపై శిక్షణ



ఉయ్యూరు: స్థానిక ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో కుట్టు, అల్లికలపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మహిళా స్ఫూర్తి సంస్థ, ఉమన్ ఎంపవర్మెంట్, ఐక్యూ ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో 30 రోజుల శిక్షణ బుధవారం ప్రారంభమైంది. 46 మంది విద్యార్థినులు శిక్షణకు హాజరయ్యారు. మహిళాస్ఫూర్తి సంస్థ అధ్యక్షురాలు పడమట భువనేశ్వరీదేవి, శిక్షకురాలు బోలెం పరమేశ్వరీదేవి, పర్వానా బేగం కుట్టు, అల్లికల్లో మెళుకువలు నేర్పించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



కంకిపాడు: వేసవిలో చలివేంద్రాల ద్వారా దాహార్తి తీరుతుందని వక్తలు పేర్కొన్నారు. కంకిపాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకీ రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, చలవాది రాజా, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, బాకీ రాజు పాల్గొన్నారు.

వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో బుధవారం వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. ప్రధాన గ్రామంలోని ఈ పైప్‌లైన్ మరమ్మతులకు గురవ్వడంతో స్పందించిన పంచాయతీ అధికారులు మరమ్మతు పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ వేసవిలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలువ గట్టు ప్రాంతాల్లో మోటారు బోర్ల సహాయంతో తాగునీటిని అందిస్తున్నామన్నారు. ప్రధాన గ్రామంలోని వాటర్ ట్యాంక్‌ను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల తాగునీటి నమూనాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సేకరించినట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంకిపాడు: పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎస్సీ కాలనీ రహదారికి రూ.18 లక్షలు, గాంధీ పార్కు అభివృద్ధికి రూ.17 లక్షలు, డ్యూటీ పాక రహదారి అభివృద్ధికి రూ.19 లక్షలు మంజూరు కావటంతో ఆయా పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ రహదారుల అభివృద్ధి, కంకిపాడు సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఎంపీడీఓ పి.అనూష, తుమ్మలపల్లి హరికృష్ణ, పులి కామేశ్వరరావు, సుదిమళ్ల రవీంద్ర, కొండా నాగేశ్వరరావు, గోగినేని రమణ పాల్గొన్నారు.

16 నుంచి కేబీఎన్‌లో వేసవి శిక్షణ తరగతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు తెలిపారు. అనంతరం శ్రీనివాసు మాట్లాడుతూ.. తమ సృజనాత్మక నైపుణ్యాలను పెంచుకునేందుకు తరగతులు తోడ్పడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలకు కంప్యూటర్ అప్లికేషన్స్, డీటీపీ, బ్యూటీషియన్, మగ్గం వర్క్స్, కార్వింగ్, మెహెందీ డిజైన్స్, జుంబా డ్యాన్స్, ఫ్రెంచ్ లాంగ్వేజ్ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులకు వేదిక్ మ్యాథ్స్, జుంబా డ్యాన్స్, వెస్టన్ డ్యాన్స్, ఫ్రెంచ్ లాంగ్వేజ్, స్పోకెన్ ఇంగ్లిష్, స్పోకెన్ హిందీ, కంప్యూటర్ బేసిక్స్, పేపర్ క్రాఫ్ట్ అంశాల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. 74169 26563, 90307 66090 నంబర్లలో సంప్రదించాలని కోరారు. డాక్టర్ వి.నారాయణరావు, వి.శ్రీదేవి, వనమాదేవి, గౌతమీదేవి పాల్గొన్నారు.

ఆత్మీయ ఆహ్వానం

ఈనెల 11న జరగనున్న తన వివాహ వేడుకకు హాజరుకావాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత చెరుకుమల్లి సతీష్ ఆహ్వానపత్రిక అందించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ నేతృత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం కలిశారు. తన అభిమాన నేత వైఎస్ జగన్, భారతి దంపతుల ముఖ చిత్రాలతో ముద్రించిన ఆహ్వాన పత్రిక అందించి అభిమానాన్ని చాటుకున్నారు. –కంకిపాడు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివాహ ఆహ్వానపత్రిక అందిస్తున్న చెరుకుమల్లి సతీష్, పక్కన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్

కార్మికుల ఉద్యోగాలకు భద్రత కల్పించాలి

పోరంకిలో మున్సిపల్ కార్మికుల ధర్నా

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల ఉద్యోగాలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కార్మికులు ధర్నా చేశారు. జిల్లా సీఐటీయూ నాయకుడు ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయటానికి కుట్ర పన్నుతుందన్నారు. ఈ కారణంగా మున్సిలిటీలో పని చేస్తున్న కార్మికుల ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని విమర్శించారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కార్మికులందరూ ఐక్యంగా పోరాటం చేయటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచే విధంగా కార్మికులు పోరాటం చేయాలని అన్నారు. సీఐటీయూ మండల నాయకుడు ఎస్‌కే. మస్తాన్‌వలి మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ రూ.6 వేలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



పోరంకిలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గతంలో కార్మికులు సమ్మె చేసిన కాలానికి జీతం కూడా ఇవ్వాలన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో కొత్తగా కార్మికులను పనుల్లోకి తీసుకోవటానికి ఎమ్మెల్యే బోడెప్రసాద్, కమిషనర్ భవానిప్రసాద్ యత్నిస్తున్నారన్నారు. కొత్తగా తీసుకునే కార్మికుల్లో ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈ ధర్నాలో మున్సిపాలటీ కార్మిక సంఘ నేతలు వై.సరళ, మధిర ఏడుకొండలు, రత్నకరుణ, జి.నరసమయ్య, బిక్షాలు, వెంకటరెడ్డి, సాంబయ్య పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పోరంకిలో శ్రీరామనవమి ప్రథమ బ్రహ్మోత్సవాలు

- నూతనంగా శ్రీకోదండ రామాలయం నిర్మాణం
- మూడు రోజులు ఉత్సవాల నిర్వహణకు కమిటీ నిర్ణయం

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న కోదండరామస్వామి దేవాలయంలో శ్రీరామనవమి ప్రథమ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఈ మేరకు బుధవారం వివరాలు వెల్లడించారు. నూతనంగా శ్రీకోదండరామాలయం నిర్మించి నందున శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈ నెల 5, 6, 7 తేదీలలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 5వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీ సీతారామచంద్ర స్వామివారికి మంగళ స్నానం, గోపూజ, స్వామివార్లను పట్టు వస్త్రాలతో పెళ్లికుమారుడు, పెళ్లి కుమార్తెలుగా చేస్తారు. విశేష అర్చనలు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారు. సాయంత్రం 6 గంటలకు పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకురార్పణ అగ్నిప్రతిష్ట తదితర పూజా కార్యక్రమాలు చేస్తారు.



పోరంకిలోని శ్రీ కోదండ రామాలయం

6వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి ముత్యాల తలంబ్రాలతో శ్రీసీతారామస్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం. 7వ తేదీ ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం స్వామి వారికి పవళింపుసేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల వెల్లువ

టిడ్కో ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు, దోమల బెడదపై అర్జీలు

ఉయ్యూరు: అద్దెలు భరించలేకపోతున్నాం.. చాలీచాలని అద్దె ఇళ్లల్లో మగ్గలేక బతుకీడుస్తున్నాం.. టిడ్కో ఇళ్లు ఇచ్చి ఆదుకోండి.. రేషన్ కార్డులు, పింఛన్లు లేక ఇబ్బందులు పడుతున్నాం.. దోమల బెడదతో అనారోగ్యాల బారిన పడుతున్నాం.. పట్టించుకోండి.. అంటూ పట్టణ ప్రజలు ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు సమస్యలు ఏకరువు పెట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పట్టణ వాసుల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అధిక సంఖ్యలో మహిళలు టిడ్కో ఇళ్ల మంజూరులో జాప్యంపై వినతులు అందజేసి ఆవేదన వెలిబుచ్చారు. సంక్షేమ పథకాలు అర్హత ఉన్నా అందటం లేదని వినతులు అందజేశారు. రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. విద్యుత్ బిల్లులు ఎడా పెడా పెంచేశారని, బిల్లుల భారం తగ్గించాలని వినతులు ఇచ్చారు. మురుగు పారుదల సక్రమంగా లేకపోవటంతో ఇబ్బందులు



టిడ్కో గృహాలు కేటాయించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు విన్నవిస్తున్న ముస్లిం మహిళలు

పడుతున్నామన్నారు. దోమల బెడదతో అనారోగ్యాల పాలవుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. ఇంటి పన్ను పేరు మార్పుపై అదనపు భారాలు లేకుండా చూడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడారు. త్వరలోనే ఇళ్ల కేటాయింపు జరుగుతుందన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్ల మంజూరు ప్రక్రియకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు బహుమతులు

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2024లో జరిగిన ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలలో రాణించిన 10వ తరగతి విద్యార్థులకు నగదు బహుమతుల ప్రధానోత్సవం బుధవారం జరిగింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు క్రమం తప్పకుండా హాజరవుతున్న, క్రమశిక్షణ కలిగిన విద్యార్థులను కూడా నగదు అవార్డులతో సత్కరించారు. దాతలు అందించిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీ రూ.70 వేలతో బహుమతులను అందజేశారు. పూర్వ విద్యార్థుల ఆడిటోరియంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, దాత బుర్రముక్కు నాగిరెడ్డి పదో తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన పి.యుగంధర్, కె.గాయత్రి, ఎస్.మనోజ్ వెంకటేష్లకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున అందజేశారు. హెచ్ఎం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ




విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

దాతలు సమకూర్చిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా వచ్చే వడ్డీని నగదు బహుమతులుగా అందచేయడం జరుగుతుం దన్నారు. రూ.6 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయన్నారు. పదోతరగతిలో అధిక మార్కులు సాధించిన వారికి కూడా నగదు ప్రోత్సాహం అందజేస్తున్నామన్నారు. దాత జాన్‌బాబు, ఎస్ఎంసీ చైర్మన్ గద్దం కుమార్, వైస్ చైర్‌పర్సన్ వీరవనిత, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని శాసనమండలి సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు బుధవారం సందర్శించారు. స్థానిక ప్రధాన కూడలి వద్ద బీజేపీ జిల్లా కార్యదర్శి సింగవరపు భాస్కర గణేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి తారకేశ్వరరావు, అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు దేవస్థానంలోకి ఆహ్వానించారు. అనంతరం అంజనీపుత్రునికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో, అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలు, చిత్రపటాన్ని ఎమ్మెల్సీ వీర్రాజుకు బహూకరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



ఎమ్మెల్సీ సోమువీర్రాజుకు స్వామి వారి చిత్ర పటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

చిరువోలు బుచ్చిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట మురళీధర్, మండల అధ్యక్షుడు కెల్లా చింతారావు, పార్టీ నాయకులు ఎదురువాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్కూల్ సిబ్బందిపై దాడి..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాఠశాల సిబ్బందిపై ఓ విద్యార్థిని బాబాయి మద్యం సేవించి వచ్చి దాడి చేసిన సంఘటన వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మల్లికార్జునపేటలోని అడపా రాములు పాఠశాలలో నక్కా కామాక్షి అనే విద్యార్థిని ఐదో తరగతి చదువుతోంది. ఆమె బాబాయి నక్కా జమలయ్య అనే వ్యక్తి పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పంపిణీ జరుగుతున్న సమయంలో లోపలకు వచ్చాడు. పాఠశాల హెచ్ఎం గంజి ప్రియాంకపై దౌర్జన్యం చేసి ఆమె విధులకు ఆటంకం కలిగించాడు. ఆ తరువాత అడ్డు వచ్చిన ఉపాధ్యాయుడు వజ్రగిరి నాగరాజుపై దాడి చేసి గాయపరిచాడు. దీనిపై ప్రియాంక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

కంకిపాడు: ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ మండలంలోని కంకిపాడు గ్రామ పంచాయతీ, పునాదిపాడు-1 సచివాలయంలో ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 0- 6 ఏళ్ల లోపు చిన్నారులు ఇంకా 321 మంది ఆధార్ నమోదు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఆధార్ నమోదు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆధార్ కార్డు నమోదు, సవరణల నిమిత్తం ఈ నెల 3వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో మడిచర్ల, ఆరుగొలను, ఎ.సీతారామపురం గ్రామాల్లోనూ, 8, 9 తేదీల్లో కొత్తపల్లి, బండారుగూడెం, కాకులపాడు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లుగా వివరించారు. 10, 11 తేదీల్లో వేలేరు, కోడూరుపాడు, బాపులపాడు గ్రామాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లుగా తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు, ఐదేళ్లు నిండిన చిన్నారులకు ఆధార్ అప్‌డేట్, పేరు, చిరునామాల సవరణలు వంటి సేవలు ఈ శిబిరాల్లో నిర్వహిస్తారని ఎంపీడీవో వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిటీ ప్లానర్ బాధ్యతల స్వీకరణ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం చీఫ్ సిటీ ప్లానర్‌గా కె.సంజయ్ రత్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. సంజయ్ రత్నకుమార్ విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీకేపీసీపీఐఆర్‌యూడీఏ)లో డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన జీవీజీఎస్వీ ప్రసాద్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్(డీటీసీపీ)కి మాస్టర్‌ప్లాన్స్ విభాగానికి డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు.

శిశువులకు పాలు ఇచ్చే గది పునః ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్

ఉయ్యూరు రూరల్: ఉయ్యూరు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన శిశువులకు పాలు ఇచ్చే గది మూసివేతపై సాక్షిలో ప్రచురించిన 'అధికారుల నిర్లక్ష్యం- పాలిచ్చు తల్లులకు శాపం' కథనానికి ఐసీడీఎస్ అధికారులు బుధవారం స్పందించారు. ఉయ్యూరు బస్టాండ్‌లో అన్ని వసతులతో కూడిన శిశువుకు పాలిచ్చు గదిని తిరిగి పునః ప్రారంభించారు. అనంతరం అక్కడ చిందర వందరగా ఉన్న బ్యానర్లను సక్రమ పరిచి తిరిగి శిశువుకు పాలిచ్చు గదిని తల్లులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ బేబీ సుకన్య చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



బస్టాండ్‌లో శిశువుకు పాలిచ్చు గదిని పునః ప్రారంభించిన సీడీపీఓ బేబీ సుకన్య

తాగునీటి సమస్యను పరిష్కరించండి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కల్పన

ఉయ్యూరు రూరల్: వేసవికాలం తాగునీటి ఎద్దడి లేకుండా అధికారయంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఉయ్యూరు ఎంపీపీ చిలి కల్పన సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు . 20 లక్షల రూపాయలతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. మండువేసవి రీత్యా తాగునీరు, సాగునీటి కొరత లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అన్ని శాఖల అధికార యంత్రాంగం సిబ్బంది విధులు నిర్వహించాలని కోరారు. ఎంపీడీవో మండలాభివద్ధి జీవీఎస్ శేషగిరిరావు నివేదిక వివరించారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిలి కల్పన

పాలిటెక్నిక్‌లో ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో వికాస్ గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్‌లో ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ 3వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ నరెడ్ల సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలో నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి, గన్నవరం మండలంలో సూరంపల్లి, ముస్తాబాద్, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఆసక్తిగల వారు నేరుగా నున్న హైస్కూల్ లో జరిగే ఉచిత శిక్షణకు హాజరుకావచ్చన్నారు.

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5 నుంచి 26వ తేదీ వరకు పాలిసెట్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వీవీ.కృష్ణమోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకు హాజరైన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఆ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.